9
సాక్షి
మెదక్
బుధవారం, 1, అక్టోబర్, 2025





మెదక్ రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మతో కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

బాసరలో పూజలు చేసిన కాంగ్రెస్ నేతలు



బాసర సరస్వతీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ మాత ఆలయాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం సందర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, చిలప్‌చెడ్ మాజీ జెడ్పీటీసీ శేషసాయిరెడ్డితోపాటు పలువురు నాయకులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



కౌడిపల్లి: నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఎమ్మెల్యే రావడంతో ఆలయ అధికారులు, పూజారులు స్వాగతం పలికారు. అనంతరం నల్లపోచమ్మదేవికి ఎమ్మెల్యే కుంకుమార్చన చేశారు. పూజలు అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సారరామాగౌడ్, నాయకులు సాయాగౌడ్, ఎల్లం, ప్రవీణ్‌కుమార్, కిశోర్‌గౌడ్, అమర్‌సింగ్, సంజీవ్, చంద్రయ్య, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన రైల్వే బ్రిడ్జి మరమ్మతులు

నేటి నుంచి పునఃప్రారంభం



బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ శివారులో ఆగస్టు 28న కురిసిన భారీ వర్షాలకు రైల్వేబ్రిడ్జి కొట్టుకుపోయిన విషయం తెల్సిందే. దీంతో గత కొంత కాలంగా బ్రిడ్జి మరమ్మతులు చేసేందుకు భారీ వర్షాలు కురుస్తుండటంతో పనులకు అంతరాయం ఏర్పడగా ఎట్టకేలకు పనులు పూర్తి చేసి బుధవారం నుంచి మెదక్ రైల్వే రాకపోకలు కొనసాగించనున్నారు. ఈ మేరకు రైల్వే అధికారులు మంగళవారం విలేకరులకు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిమాపక కేంద్రం కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న నారాయణరావు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ప్రాంతం పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోందని అగ్ని ప్రమాదాలపట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ ఎమర్జెన్సీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ నారాయణరావు పేర్కొన్నారు. ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ సీఆర్‌ఎస్ నిధులతో సదాశివపేట అగ్నిమాపక కేంద్రం ఆవరణలో నిర్మించిన అగ్నిమాపక కేంద్రం నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అగ్నిమాపక కేంద్రం పరిధిలో 552 అగ్ని ప్రమాదాలు జరిగాయని 28 అత్యవసర రక్షణ చర్యలు చేపట్టారన్నారు. అగ్నిప్రమాద రక్షణ చర్యల్లో భాగంగా రూ.80.74 కోట్ల విలువైన ఆస్తులను కాపాడినట్లు తెలిపారు.

వెళ్లిరా బతుకమ్మా

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురం

ఆడిపాడిన యువతులు, మహిళలు

మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్: తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అద్దం పడుతూ, పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే సద్దుల బతుకమ్మ సంబురాలు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రామాలయం, ఫతేనగర్, వెంకటరావునగర్, నవాబుపేట, కోలిగడ్డ, హమాలికాలని, బాలాజీమఠం తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, చౌరస్తాల వద్ద బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. రామాయంలో జరిగిన ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మెదక్‌లోని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ రాహుల్ రాజ్ ఆయన సతీమణి తోపాటు అమ్మనాన్నలు, పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పట్టణ శివారులోని మల్లెం చెరువు, పిట్లంచెరువు, బంగ్లాచెరువు, ఎంఎన్‌కెనాల్ తదితర నీటివనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి 'వెళ్లిరా బతుకమ్మా...మళ్లచ్చే పండక్కి మా ఇంటికిరా'అంటూ వీడ్కోలు పలికారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

'జెడ్పీ' పీఠానికే గురి

పట్టు కోసం కాంగ్రెస్..
పునర్వైభవం కోసం బీఆర్‌ఎస్..
ఉనికి కోసం బీజేపీ

- జెడ్పీ చైర్మన్ కోసం వలస వెళ్లనున్న పెద్దాయన
- స్థానిక సంస్థల్లో పట్టుకోసం సర్వశక్తుల్ని కూడదీసుకుంటున్న పార్టీలు



స్థానిక సంస్థల ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. పట్టు కోసం కాంగ్రెస్..పునర్వైభవం కోసం బీఆర్‌ఎస్..ఉనికి కోసం బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించాయి. అయితే జెడ్పీ పీఠాన్ని చేజిక్కించుకోవాలని అటు అధికార పార్టీ కాంగ్రెస్ ఇటు ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ సర్వశక్తుల్ని కూడదీసుకుంటున్నాయి.

– మెదక్ అర్బన్:

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న కాంగ్రెస్ ఈ సారి పట్టు సాధించేందుకు కృషి సర్వశక్తులు ఒడ్డుతోంది. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ప్రధానాస్త్రంగా ప్రయోగించే యత్నాల్లో ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడగాలని భావిస్తోంది. ఆ దిశగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు పార్టీ కేడర్‌ను బలోపేతం చేస్తున్నారు. గెలుపు అవకాశాలున్నవారికి, పార్టీ కోసం కష్టించిన వారికే టికెట్లు ఇవ్వాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం. అలాగే సర్పంచ్ అభ్యర్థులను సైతం ఎంపిక చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇక సొంత గ్రామాల్లో రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో కాంగ్రెస్ నుంచి జెడ్పీ పీఠాన్ని ఆశిస్తున్న ఓ పెద్దాయన, పక్క మండలం నుంచి బరిలోకి దిగేందుకు ప్రయత్నాలు ఆరంభించినట్లు తెలుస్తోంది.

పట్టు చేజారినివ్వకుండా బీఆర్‌ఎస్

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఊడ్చేసిన బీఆర్‌ఎస్ తిరిగి పునర్వైభవం దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. గత ఎన్నికల్లో 20 జెడ్పీటీసీ స్థానాలకు 18 స్థానాల్లో విజయం సాధించడంతోపాటు సుమారు 15 ఎంపీపీ స్థానాల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. అదే పట్టును కొనసాగించేందుకు 'ఇంటింటికీ బాకీ కార్డు'ను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లాలని ఆపార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలను ఎండగట్టే విధంగా ప్రచార సరళి నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గ్రామీణులను ఆకట్టుకునేలా డాక్యుమెంటరీలు రూపొందించినట్లు తెలుస్తోంది. రైతులకు యూరియ కష్టాలు, మహిళలకు రూ.2,500 ఫించన్, రూ.4 వేల నిరుద్యోగ భృతిని వంటి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో బీఆర్‌ఎస్ శ్రేణుల్ని ఇతర పార్టీల్లోకి వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి కాపాడుకోగలిగారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై తరచూ ఆందోళనలు నిర్వహిస్తూ నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. అదే బలంతో ఎన్నికల పోరాటంలో నిలిచి విజయం సాధిస్తామన్న ధీమా వారిలో వ్యక్తమవుతోంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి ఓ ప్రధాన నాయకుడికి సొంత ప్రాదేశిక నియోజక వర్గంలో జెడ్పీటీసీ రిజర్వేషన్ అనుకూలంగా వచ్చింది. ఆయన అక్కడి నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కమలం వికసించేనా!

గత పార్లమెంటరీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన బీజేపీని స్థానిక ఎన్నికల్లో సైతం వికసించేలా ప్రచార పర్వం కొనసాగించాలని ఆ పార్టీ భావిస్తోంది. ప్రధాని మోదీ పేరుతో యువతను, సామాన్య ప్రజానీకాన్ని ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.యువకులు, విద్యాధికులపై పార్టీ ఆశలు పెట్టుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ మూలాలున్న గ్రామాలపై దృష్టి పెట్టింది. గెలుపు అవకాశాలున్న అన్ని చోట్ల, గెలుపోటములను ప్రభావితం చేసే గ్రామాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇప్పటికే జిల్లాలో 'సేవా పక్షం'పేరిట ఎంపీ రఘునందన్ రావు స్థానిక సంస్థల ఎన్నికల శంఖాన్ని పూరించారు. ఆయన ఎంపీగా ఎన్నికైన అనంతరం పలు రోడ్లు, సోలార్ దీపాలను మంజూరు చేయించారు. నియోజక వర్గంలో తరచూ పర్యటనలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

రాజుకున్న ఎన్నికల వేడి

రిజర్వేషన్ కలిసొచ్చిన గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

- దసరారోజు మటన్, మద్యం పంపిణీకి సన్నాహాలు
- రాష్ట్ర నేతల ఆశీస్సులకోసం పరుగులు



స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో రిజర్వేషన్ కలిసొచ్చిన పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ఆశావహులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు దసరా రోజున మద్యం, మటన్ పంపిణీ చేసేందుకు సన్నాహాలు మొదలెట్టారు. రిజర్వేషన్ కలిసిరాని బడానేతలు పక్క మండలం నుంచి పోటీచేసేందుకు పావులు కదుపుతున్నారు.

– మెదక్‌జోన్:

జిల్లాలో 21 మండలాలు, 492 పంచాయతీలు, 21 ఎంపీటీసీ స్థానాలు, 21 జెడ్పీటీసీ స్థానాలున్నాయి. ముందు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుతో ఎన్నికలు జరుగనున్నాయి. ఆశావహులకు రిజర్వేషన్ కలిసొచ్చిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులకు పోటీ చేయదలచుకున్న నేతలు గ్రామాల్లో అప్పుడే మందు, విందులతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఇప్పటికే మద్యం కొనుగోలు!

ఎన్నడూలేనివిధంగా చిన్నా, చితక పనులుంటే మాకు చెప్పండి చేసి పెడతాం అంటూ వరుసలు పెట్టి మరీ పలుకరిస్తూ ఓటర్ దేవుళ్లను ఆశావహులు మచ్చిక చేసుకుంటున్నారు. గాంధీ జయంతి రోజున మద్యంషాపులు మూసిఉంటాయని ముందుగానే భారీగా మద్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దసరా రోజు తెల్లవారు జామునే ఇంటికి కిలో చొప్పున మటన్, ఆఫ్ బాటిల్ చొప్పున మద్యం పంపిణీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

పక్క మండలాలకు వలస

మెదక్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు అయ్యాక 2019లో మొదటిసారి జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్ బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారైంది. ప్రస్తుతం ఆ సీటు జనరల్‌కు కేటాయించింది. జిల్లాలో పలువురు బడా నేతలు జెడ్పీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి సొంత ప్రాదేశిక స్థానాల్లో రిజర్వేషన్ అనుకూలించలేదు. దీంతో ఎలాగైనా జెడ్పీ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు సదరు నేతలు పక్కమండలం నుంచి జెడ్పీటీసీగా గెలిచేందుకు పావులు కదుపుతున్నారు.

ఆశలు అడియాశలైన వేళ

ఇందులో ప్రధానంగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి (ఓసీ) వర్గానికి చెందిన వ్యక్తి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌ను వీడి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో అప్పట్లో ఆయనకు జెడ్పీచైర్మన్ పదవి కట్టబెడతారని ప్రచారం జోరుగా సాగింది. కానీ అయితే ఆయన స్వగ్రామం కౌడిపల్లి సొంత జిల్లా పరిషత్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడంతో కొల్చారం ఓసీ జెడ్పీటీసీ జనరల్ కావటంతో అక్కడి నుంచి పోటీచేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అదే నియోజకవర్గం మాసాయిపేటకు చెందిన రాజిరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ నుంచి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆయన సైతం జెడ్పీ చైర్మన్ ఆశించినప్పటికీ ఆయన జిల్లా ప్రాదేశిక(జెడ్పీటీసీ)ఎస్సీలకు రిజర్వుడ్ అయింది. పాపన్నపేట మండలానికి చెందిన తాజా, మాజీ ఎంపీపీ చందన భర్త ప్రశాంత్‌రెడ్డి అదే మండలానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి కూడా జెడ్పీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఆ మండలంలోని జిల్లాపరిషత్ బీసీకి రిజర్వుడ్ కావటంతో వారి ఆశలు సైతం అడియాశలైయ్యాయి. మొదటి నుంచి ఎన్నోఆశలు పెట్టుకుని రూ.లక్షలు ఖర్చులు పెట్టుకున్న బడా నేతలు పక్కమండలాల నుంచి పోటీచేసి జెడ్పీ పీఠాన్ని కై వసం చేసుకునేందుకు రాష్ట్రనేతల వద్దకు పరుగులు పెడుతున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలే

- ర్యాలీలు, సభలకు అనుమతులు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 29 నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని అయితే మెదక్, తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్, మున్సిపల్‌ల్లో కోడ్ ఉండదని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారానికి 3 రోజులు ముందుగానే అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా కోడ్ ఉల్లంఘించినట్లు, డబ్బులు పంచినట్లు సమాచారముంటే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎవరూ రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు వెంట తీసుకెళ్లకూడదని, పెళ్లిళ్లు, ఆస్పత్రి ఖర్చులు, పిల్లల కాలేజీ ఫీజులు చెల్లించేందుకు అంతకుమించి డబ్బు తీసుకెళ్లి పట్టుబడితే సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పేపర్, టీవీ, సోషల్ మీడియా యాడ్స్ విషయంలో పార్టీలు, అభ్యర్థులు ఎంసీఎంసీ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగి ఉన్నవారు వాటిని డిపాజిట్ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.

హరికథ చెప్పిన కరాటే కల్యాణి



కరాటే కల్యాణితో నవదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గురునగర్ కాలనీ శ్రీనవదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద సోమవారం రాత్రి కరాటే కల్యాణి హరికథ కాలక్షేపం నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం, సుబ్రహ్మణ్యవల్లి దేవసేన కల్యాణ మహత్యానికి సంబంధించిన ఘట్టాలను హరికథగా చెప్పారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో నవదుర్గ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

కానిస్టేబుల్ నరేశ్‌ను అభినందించిన ఎస్పీ



కానిస్టేబుల్ నరేశ్‌ను అభినందిస్తున్న ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: శిక్షణా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచే సిబ్బందిని జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఫైరింగ్, పీపీటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన కానిస్టేబుల్ నరేశ్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇలాంటి యువ సిబ్బంది కృషి భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్తుందన్నారు. ఈ సందర్భంగా నరేశ్‌కు రివార్డు మంజూరు చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ అల్తాఫ్ హుస్సేన్‌లను ఎస్పీ ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మీకు ఏవైనా సమస్యలు ఎదురైనా, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, శైలేందర్, ఎస్సైలు నరేశ్ భవానీ కుమార్, మణి పాల్గొన్నారు.

సాయుధ కారాగారంలో ఆయుధపూజ

పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



ఆయుధ పూజ చేస్తున్న జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు

సంగారెడ్డి జోన్: జిల్లా పోలీస్ సాయుధ కారాగారంలో ఆయుధ పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాష్టమి పురస్కరించుకుని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆయుధాలతోపాటు వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణలో విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతం అయ్యేందుకు దుర్గామాత కరుణ, కటాక్షాలు పోలీసులపై ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెల రోజుల పాటు (అక్టోబరు 1వ తేదీ నుంచి 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని చెప్పారు. ముందస్తు అనుమతి లేనిదే ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మాకు రిజర్వేషన్ ఉండదా?

- కలెక్టరేట్ వద్ద కొత్త లింగాయపల్లి దళితుల నిరసన
- ఎస్సీలున్న చోట బీసీలకు.. బీసీలున్న చోట ఎస్సీలకు రిజర్వేషన్!



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న దళితులు

మెదక్ కలెక్టరేట్/పాపన్నపేట(మెదక్): డబ్బై ఐదేళ్లుగా ఒక్కసారి కూడా తమ గ్రామం ఎస్సీలకు రిజర్వుడు కాలేదని పాపన్నపేట మండలం కొత్త లింగాయపల్లి దళితులు ప్రభుత్వంపై మండిపడ్డారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా కుట్రపూరితంగా రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆరోపిస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో సదరు గ్రామంలోని దళితులు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల కేటాయించిన రిజర్వేషన్లతో తాము పోటీ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో 25% ఎస్సీ జనాభా ఉండగా గతంలో రెండు వార్డులు ఎస్సీలకు రిజర్వేషన్ ఉండేవని తెలిపారు. ఈసారి ఆ రెండు కూడా లేకుండా కుట్రతో రిజర్వేషన్లు కేటాయించారని ఆరోపించారు. దళితులు కనీసం వార్డు మెంబర్‌గా కూడా ఎదగొద్దని కుట్రపూరితంగా రిజర్వేషన్లు కేటాయించినట్లు ఉందన్నారు. గ్రామంలో 8వార్డులు ఉండగా 4 వార్డుల్లో 90% ఎస్సీలు, 10% ఓసీ జనాభా ఉందని తెలిపారు. ఆ వార్డుల్లో బీసీ రిజర్వేషన్ చేయడంతో ఎస్సీలు పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని మరో 4 వార్డుల్లో ఓసీలు, బీసీలు లేరు, అక్కడ అన్‌రిజర్వ్ చేశారని ఆరోపించారు. ఈ రిజర్వేషన్‌ను పునఃపరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలసిన వారిలో గ్రామానికి చెందిన దళితులు దినకర్, ఆనంద్, కుమార్, అనంతి, దేవయ్య, సాయిబాబు, ఆగమయ్య, సామేల్, సాయికుమార్,భాగ్య, రత్నమ్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ శక్తిపీఠంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రదోష పూజ, మహా మంగళ నీరాజనం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగలాముఖీ వ్రత సంకల్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితుడు వామనశర్మ, ఆలయ భూ దాత పబ్బ రమేశ్ గుప్తా, నాయకులు మన్సూర్, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, మైపాల్ రెడ్డి, లాయక్, లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, కల్లూరి వెంకటేష్, ముత్యంరెడ్డి, అశోక్, నర్సయ్య ఉన్నారు.

బస్టాండ్ ఎదుట నిలిచిన మురుగు?



బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీరు

హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళీఘణాపూర్‌లో చేపట్టిన హైవే రోడ్డు పనుల కారణంగా బస్టాండ్ ఆవరణలో గుంత ఏర్పడి మురుగునీరు నిలిచింది. దీంతో బస్టాండ్‌లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా మురుగునీటి నుంచి దుర్వాసన వస్తుందని, దోమలు వృద్ధి చెందే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.

కళాశాలలో ప్రవేశానికి గడువు పెంపు

నర్సాపూర్ రూరల్: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాల ప్రవేశానికి అక్టోబర్ 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్, కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ తెలిపారు. ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులతో పాటు రెగ్యులర్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, రెండేళ్ల డిప్లమా కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సాదత్‌అలీ

దుబ్బాక: పట్టణ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సాదత్‌అలీ ఇన్నోవేటీవ్ టీచర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో జటాదర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(జెట్) సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. వింగ్ కమాండర్ ఆంటోని చేతుల మీదుగా ఆయన అవార్డు, నగదు పురస్కారం అందుకున్నారు. కాగా సింపుల్ టాస్క్ గ్రేట్ కాన్సెప్ట్ ప్రయోగాలతో విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ప్రయోగాత్మక బోధనను అందిస్తున్న సాదత్ అలీ కృషిని గుర్తించి ఇన్నోవేటీవ్ అవార్డును ప్రదానం చేశారు.

కలిసి ఉంటేనే గ్రామం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని ప్రజలందరూ కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోరంపల్లి గ్రామంలో ఆర్‌ఐ సాయిశ్రీకాంత్‌తో కలిసి మానవహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని పాటించరాదన్నారు. కుల,మతాలు, తారతమ్యం లేకుండా, అన్నదమ్ముల వలే కలిసి ఉండాలని సూచించారు. అందరికి ఆదర్శంగా ఉంటూ ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, హన్మంతు తదితరులు ఉన్నారు.

భవానీ మాత పడి పూజ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని భక్తిధాం(బల్కంచెల్క) తండాలో మంగళవారం రాత్రి భవానీ మాత పడి పూజ వైభవంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, మహబూబ్ నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ ప్రవచనం చేశారు. ఎంతఊ రాములు, శంకర్, ఖత్రోత్ జైలిసింగ్, రాములు, రూప్‌సింగ్, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్ పాల్గొన్నారు.



మంజీరా పరీవాహక ప్రాంతాలను ముంచెత్తిన వరద

ఎన్నాళ్లీ ముంపు



చాల్కి గ్రామ శివారులో నీట మునిగిన పత్తి చేను



అమీరాబాద్ శివారులో నీట మునిగిన పత్తి

మంజీరా బ్యాక్ వాటర్‌లో మునిగిన పంటలు

- ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో నష్టం
- పరిహారం అందించాలని కోరుతున్న రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): సాగు, తాగు నీటి కష్టాలు తీర్చే మంజీరానది పంటలను ముంచేస్తుంది. ప్రతి ఏటా ఈ నది బ్యాక్ వాటర్ వల్ల పరీవాహక ప్రాంతాల వెంట వందలాది ఎకరాల పంటలు నీటి పాలవుతున్నాయి. పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టం వివరాలను సేకరించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నా పరిహారం మాత్రం అందడం లేదని న్యాల్‌కల్ మండలంలోని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నాటక, మహారాష్ట్ర నుంచి ప్రవహించే మంజీరా నది న్యాల్‌కల్ మండలం గుండా జిల్లాలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో కురిసే భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానల వల్ల మంజీరాలోకి పెద్ద ఎత్తున వరద చేరుతుంది. వరదలు వచ్చినప్పుడల్లా బ్యాక్ వాటర్ వల్ల పరీవాహక ప్రాంతాలైన మండల పరిధిలోని హుస్సేన్‌నగర్, చాల్కి, అమీరాబాద్, చీకూర్తి, కాకిజన్‌వాడ, ముర్తుజాపూర్, రాఘవాపూర్ శివారుల్లో పంటలు నీట మునుగుతున్నాయి. ప్రభుత్వం గుర్తించిన దానికంటే అధికంగా భూములు ముంపునకు గురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని రైతులు ఫిర్యాదు చేయడంతో గత 15 ఏళ్ల క్రితం అధికారులు సర్వేలు చేశారు. కానీ ఇప్పటి వరకు దాని ఫలితాలు మాత్రం ప్రకటించలేదని తెలిపారు. ప్రతి ఏటా పంటలు నీట మునిగి తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

మంజీరాలోకి భారీ వరద

మంజీరా నదిలోకి ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. మూడు రోజులుగా వస్తున్న వరదల వల్ల నది పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 500 ఎకరాల్లో పంటలు నీట మునిగింది. ప్రస్తుతం మంజీరాలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో సుమారు వెయ్యి ఎకరాల వరకు పత్తి, సోయా పంటలు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా చీకూర్తి గ్రామ సమీపంలో గల వంతెన నీట మునడంతో రాకపోకలను అధికారులు నిలిపి వేశారు.

పరిశీలించిన అధికారులు

చీకూర్తి గ్రామ సమీపంలో గల ఇళ్ల వద్దకు బ్యాక్ వాటర్ రావడంతో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, హద్నూర్ ఎస్‌ఐ సుజిత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఇళ్ల వద్దకు చేరిన నీటిని పరిశీలించారు. మూడు కుటుంబాలను తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు.

పెట్టుబడి వచ్చేటట్టు లేదు..



నాకున్న రెండు ఎకరాలతో పాటు వేరే రైతులకు చెందిన నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశా. పక్కనే ఉన్న మంజీరా నదిలోకి చాలా నీరు రావడంతో పంటలు నీట మునిగాయి. రూ.50 వేలు పెట్టుబడి పెట్టా. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్టు లేదు.

– రాజు రైతు, చాల్కి గ్రామం

ప్రాథమిక అంచనా వేశాం



మంజీరా బ్యాక్ వాటర్ వల్ల సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశాం. ముఖ్యంగా పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం వరద ప్రవాహం కొనసాగుతుంది. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత క్షేత్ర స్థాయిలో పంట నష్టం వివరాలు సేకరిస్తాం.

– అభినాష్ వర్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి, న్యాల్‌కల్

సేవాభావం.. ధర్మ రక్షణ



మాట్లాడుతున్న అమరేంద్ర ప్రసాద్

నంగునూరు(సిద్దిపేట): సేవాభావం, ధర్మ రక్షణ కోసం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పని చేస్తారని విశ్వహిందూ పరిషత్తు జిల్లా కార్యవాహ అమరేంద్ర ప్రసాద్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నంగునూరులో పదసంచలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా కతాతు నిర్వహించి ఆయుధ పూజ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ విపత్తు సంభవిస్తే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సేవా భావంతో పని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు అఖండ కార్యవాహ రాగుల వీరారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘దాపటెద్దు’ పుస్తకావిష్కరణ



ఎద్దులు, రైతుల మధ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నంగునూరు(సిద్దిపేట): అక్షర సేద్యం ఫౌండేషన్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కవి బైతి దుర్గయ్య, బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ రాసిన దాపటెద్దు, అరుగుబడి పుస్తకాన్ని మంగళవారం ముండ్రాయిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పులి రాజు మాట్లాడుతూ.. రైతులే నిజమైన శాస్త్రవేత్తలని, వారి సుదీర్ఘ అనుభవం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, లలిత, అశోక్‌కుమార్, నవీన్, అనిల్‌కుమార్, కవిత, సత్యలక్ష్మి, మల్లికార్జున పాల్గొన్నారు.

సాహిత్యంతోనే సమాజం ప్రభావితం

సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య వెంకట్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మనిషిని మనిషిగా తీర్చిదిద్దేది పద్యమేనని సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్యం వ్యక్తికి సంస్కారాన్ని, విజ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తుందన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన శక్తి సాహిత్యానికి మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ అనురాధ, వీరారెడ్డి, రఘురామశర్మ, క్షేత్రం నిర్వాహకులు హరినాథ శర్మ, సింగీతం నరసింహారావు, సరస్వతి రామశర్మ పాల్గొన్నారు.

ఆలయంలో సినీనటుడు పూజలు



ఎల్‌బీ శ్రీరామ్‌కు చిత్ర పటాన్ని అందిస్తున్న చైర్మన్

దుబ్బాక: దుబ్బాక బాలాజీ ఆలయంలో సినీనటుడు ఎల్‌బీ శ్రీరాం మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో చేనేత కార్మికుల స్థితిగతులపై నిర్మిస్తున్న షాట్ ఫిలింలో నటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం చాలా అద్భుతంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీధర్, వేదపండితులు ఆయనను సత్కరించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



యాదగిరి

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు... గ్రామానికి చెందిన తోడేటి యాదగిరి(40)డ్రైవర్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే అతడు మద్యానికి బానిసై రోజు తాగుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకగా గ్రామ బండ చెరువు వద్ద అతని చెప్పులు, దుస్తులు, బైక్ లభ్యమయ్యాయి. అనుమానంతో చెరువులోకి దిగి వెతకగా యాదగిరి మృతదేహం లభ్యమైంది.

మంజీరాలో దూకిన యువకుడు



లోక చంద్ర

సంగారెడ్డి: చౌటకూర్ మండలం శివంపేట వద్ద ఉన్న మంజీరా నదిపై గల బ్రిడ్జి పైనుంచి యువకుడు మంగళవారం నదిలో దూకాడు. ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. జోగిపేటకు చెందిన అల్లే లోక చంద్రగా గుర్తించారు. అతడు గతంలో పలు వ్యాపారాలు చేసి నష్టపోయినట్లు తెలుస్తుంది. కొంత కాలంగా ఓ యూట్యూబ్ చానల్ పెట్టి నడిపిస్తున్నాడు. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో క్షణాల్లోనే ఆ యువకుడు నీటి ప్రవాహంలో కొట్టుకొని పోయాడు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



లక్ష్మీనారాయణ

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం, పీఆర్ టీయూటీఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం గుండె పోటు రావడంతో మృతిచెందాడు. దీంతో నర్సాపూర్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిని తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు తరలివచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాయొల్ల వెంకయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన రాయొల్లి వెంకయ్య(67) స్థానిక పెట్రోల్‌బంక్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 28న ఉదయం విధులు ముగించుకుని 765డి జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. కాగా అతన్ని వెనక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో తీవ్రగాయాలు అయ్యాయి. బాధితున్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించి అనంతరం మంగళవారం గాంధీకి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

64 లీటర్ల మద్యం స్వాధీనం

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌పై మంగళవారం పోలీసులు దాడిచేసి 64 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజేశ్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. బెల్ట్‌షాప్ నిర్వాహకులు నర్సాగౌడ్, దత్తాగౌడ్, బాలక్రిష్ణగౌడ్‌పై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



మృతి చెందిన పాడి గేదెలు

కొల్చారం(నర్సాపూర్): విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో కొల్చారంలో జరిగింది. వివరాలు ఇలా... బాధితుడు ఎండుగుల దుర్గయ్య తనకున్న రెండు గేదెలను మేత కోసం గ్రామ శివారులోని పెరుమాండ్లకుంట వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మేస్తుండగా ఎల్‌టి లైన్ తెగిపడటంతో గమనించకుండా వెళ్లిన గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గమనించిన బాధిత రైతు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపి వేశారు. రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కుల గణన ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: తాజాగా 2024 కుల గణన ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీకే ఫంక్షన్‌లో లంబాడీల భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేయడం వల్ల గిరిజన సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కొంత మంది కాంగ్రెస్‌కు చెందిన గోండు, ఆదివాసీ నాయకులు బంజారులను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్రపూరితంగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారన్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా అక్టోబర్ 8న హుస్నాబాద్‌లో 10 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు భిక్షపతి నాయక్, హేమ నాయక్, తిరుపతి నాయక్, రాజు నాయక్, కృష్ణా నాయక్, మోహన్ నాయక్, హరియా నాయక్ ఉన్నారు.

కొమురవెల్లి నుంచి బస్సులు నడపాలి

కేవీపీఎస్ జిల్లా నేత బాలకిషన్



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: కొమురవెల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సులను నడపాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ కోరారు. జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో కంట్రోలర్ రామచంద్రంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ– జగదేవ్‌పూర్ మీదుగా ఈసీఐఎల్ వరకు, అదే విధంగా మునిగడప వయా తిమ్మాపూర్–రాయవరం–కొడకండ్ల–ప్రజ్ఞాపూర్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులను నడిపించాలని కోరామన్నారు. ఈ రూట్లో బస్సు సౌకర్యం కల్పించడం వల్ల భక్తులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఆయా రూట్లను పరిశీలించి బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని కంట్రోలర్ చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసు, సంపత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన ట్రాలీ

సిద్దిపేట జిల్లాలో ఘటన



మనుశ్రీ

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తున్కిబొల్లారంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బక్కస్వామి నర్సింలు, సుప్రియ దంపతులకు చైత్ర, శ్రీనిధి, మనుశ్రీ ముగ్గురు కుమార్తెలు సంతానం. కాగా చిన్న కూతురు మనుశ్రీ(17 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసుకుంటూ అటువైపు వస్తున్న ట్రాలీ వాహనం డ్రైవర్ అజాగ్రత్త కారణంగా చిన్నారిని ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రెండు డీసీఎంలు ఢీ..

ముగ్గురికి గాయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మునిగడప సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మర్కూక్ మండలం పాములపర్తి వద్ద పేడ లోడ్‌తో కొడకండ్ల వైపు వెళుతున్న డీసీఎంను సిరిసిల్ల నుంచి బట్టల లోడ్‌తో వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ మల్లేశం, లక్ష్మారెడ్డితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గజ్వేల్‌కు తరలించారు.

రైతు బిడ్డకు డీఎస్పీ ఉద్యోగం



కుమ్మరి శివరామనందన్

నారాయణఖేడ్: నిరుపేద కుటుంబంలో జన్మించిన రైతు కుమారుడు డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శివరామనందన్‌గ్రూప్–1 ఫలితాల్లో ర్యాంకు సాధించి సత్తా చాటాడు. కుమ్మరి నర్సింహులు, మల్లమ్మలకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. వీరికి నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండటంతో వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను పోషించారు. చిన్న కుమారుడు శివరామనందన్‌ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువగా, 7వ తరగతి వరకు హన్మత్‌రావుపేటలో, 10వ తరగతి లింగంపల్లి గురుకులంలో చదివాడు. ఇంటర్మీడియెట్ శ్రీతేజ కళాశాలలో ఉచితంగా సీటు ఇవ్వడంతో పూర్తి చేశాడు. సేయింట్ ఆంటోనీస్‌లో డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియాలో ఎమ్మెస్సీ పూర్తి చేసి నాలుగేళ్ల క్రితం కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం పొందినప్పటికీ చెన్నైలో విధులు నిర్వహించాల్సి రావడంతో ఆగిపోయాడు. గ్రూప్–1 పరీక్షలు రాసి డీఎస్పీ ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నర్సాపూర్ రూరల్: ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సాపూర్ పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణంలోని శ్రీనివాస వైన్స్ వెనుక ఉన్న దుర్గాల మల్లేశ్ ఇంట్లో అద్దెకుంటున్న పెద్ద సురేశ్ ఇంటి తాళాన్ని గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి లోనికి వచ్చారు. బీరువాలోని రూ.65వేల నగదు, ఐదు తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లారు. కాగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ బల్బు సరి చేస్తుండగా..

షాక్‌కు గురై రైతు మృతి



రాజమల్లయ్య మృతదేహం

దుబ్బాకరూరల్: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రైతు కంతుల రాజమల్లయ్య(58) మంగళవారం తన కోళ్ల ఫారంలోకి కోడి పిల్లలను తీసుకు వచ్చాడు. సాయంత్రం వెళ్లి చూడగా విద్యుత్ బల్బు రాకపోవడంతో అక్కడే విద్యుత్(బుడ్డి)పై బల్బును కట్టెతో సరి చేస్తున్నాడు. దీంతో ఒక్కసారిగా బల్బుకు ఉన్న వైరు తెగి వచ్చి అతని మెడకు చుట్టుకుంది. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడ ఉన్న వ్యక్తి గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీంటి పర్యంతమయ్యారు.